ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 20 మే 2024





23 వరకు వర్షాలు

జిల్లా సగటు వర్షపాతం 11.1 మిల్లీమీటర్లు

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23వ తేదీవరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ ఆదివారం హెచ్చరించింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉంగుటూరులో అత్యధికంగా 36.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఉయ్యూరులో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాసగటు వర్షపాతం 11.1 మిల్లీమీటర్లుగా నమోదైంది. పెదపారుపూడిలో 33.4, పామర్రులో 28.6, నందివాడలో 28.4, ఘంటసాలలో 24.8, చల్లపల్లిలో 23.0, అవనిగడ్డలో 15.2, గుడివాడలో 13.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొవ్వలో 13.4, మోపిదేవిలో 8.6, తోట్లవల్లూరులో 7.4, గుడ్లవల్లేరులో 5.6, గన్నవరంలో 4.6, కంకిపాడులో 4.2, కోడూరులో 3.2, నాగాయలంకలో 2.8, పమిడిముక్కలలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పంటకు మొలకలు

వేసవి కాలంలో కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, వరి తడిసిపోయాయి. మొక్కజొన్నకు మొలకలు వచ్చాయి. మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం గ్రామంలో రెండవ పంటగా వేసిన మొక్కజొన్న, వరి నూర్పిడి చేయగా అకాల వర్షంతో కల్లంలోనే తడిసిపోయాయి. రెండు రోజుల్లో పూర్తిగా నూర్పిడి అయ్యి ఇంటికి చేరాల్సిన సమయంలో మొక్కజొన్న పంట కండెల రూపంలోనే పొలాల్లోనే ఉండి మొలకలు వచ్చాయని రైతులు కోసూరు వీరరాఘవయ్య, రామారావు, వీరాంజనేయులు వాపోయారు. - మోపిదేవి



కల్లంలోనే తడిసి ఉన్న వరి (ఇన్‌సెట్‌లో) మొలకలు వచ్చిన మొక్కజొన్న

నాని ఓట్ల డబ్బు మావాళ్లే దోచేశారు!



వైసీపీ మైనార్టీ నాయకుడు సర్దార్ బేగ్

"కొడాలి నాని ఓటర్లకు పంపిన డబ్బును 10, 11, 12వ వార్డులకు చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు దోచేశారు. రూ.7 కోట్లు తీసుకున్నారు. వారిని కల్యాణమండపానికి పిలిపించి నిజాలను తెలుసుకో అన్నా. లేకపోతే మండపంలోని కుక్కలను వారి మీదకు వదిలెయ్. లేదంటే ఆ డబ్బులతో గోవా, మలేషియా, సింగపూర్ చెక్కేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారు"

- కొడాలి నాని ముఖ్య అనుచరుడు, మైనార్టీ నాయకుడు సర్దార్ బేగ్ సెల్ఫీ వీడియోలో చెప్పిన మాటలివి.

గత రెండు రోజులుగా సెల్ఫీ వీడియో వైరల్ అవుతున్నా వైసీపీ నాయకులు ఖండించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది.



మూడు వార్డులకు రూ.7 కోట్లు తీసుకున్నారు

గుడివాడ : స్థానిక వైసీపీ అభ్యర్థి కొడాలి నాని అనుచరుడు సర్దార్‌బేగ్ సెల్ఫీ వీడియో సంచలనం కలిగిస్తోంది. నియోజకవర్గంలతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ వీడియో చర్చ నడుస్తోంది. పట్టణంలోని 10, 11, 12 వార్డుల్లోని ఓటర్లకు పంపిణీ నిమిత్తం కొడాలి నాని పంపిన డబ్బును వైసీపీ మైనార్టీ నాయకులు కాజేశారని ఆయన ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ వీడియోలో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల వ్యయాలను పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అధికారులను నియమించింది. పరిమితికి మించి డబ్బును ఖర్చు చేస్తే అభ్యర్థులపై వేటు వేస్తుంది. అసెంబ్లీ నియోజకవర్గంలో అయితే రూ.45 లక్షల వరకు ఎన్నికలకు ఖర్చు చేసుకోవచ్చు. సర్దార్ బేగ్ తెలిపిన రూ.7కోట్లు నగదు విషయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిగణలోకి తీసుకుంటారా లేదా అధికార పార్టీకి తలొగ్గి కిమ్మనకుండా ఉంటారా అనేది తేలాల్సి ఉంది.

- **ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ సెల్ఫీ వీడియో హల్‌చల్**
- **అజ్ఞాతంలోకి సర్దార్ బేగ్**
- **ఇది కోడ్ ఉల్లంఘనే : టీడీపీ**
- **చర్యల కోసం ఈసీకి రిటర్నింగ్ అధికారి సిఫారసు చేసేనా?**

నోరు మెదపని వైసీపీ వర్గాలు

సర్దార్ బేగ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీని ఆత్మరక్షణలో పడేశాయి. ఏకంగా నాని పంపిన నగదును వైసీపీ నాయకులే దోచేశారని చెప్పడంతో ఏం చేయాలో తెలియక ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై స్పందించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఎన్నికల కమిషన్ కేసు నమోదు చేస్తే పోలీసు విచారణ ఎదుర్కోవలసి వస్తుందనే భయం, గడ్డం గ్యాంగ్, నాని ముఖ్య అనుచరుల నుంచి ప్రాణహాని ఉండవచ్చుననే అనుమానంతో సర్దార్‌బేగ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు వైసీపీ నాయకులే బాహాటంగా పేర్కొంటున్నారు.

రిటర్నింగ్ అధికారి ఎక్కడ?

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచే గుడివాడ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యంతరాలు లేవనెత్తకుండా ఆమె వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. వైసీపీకి అనుకూలంగా ఆర్వో వ్యవహరించారని టీడీపీ నాయకులు బహిరంగంగా విమర్శించారు. ఏకంగా నాని కోడ్ ఉల్లంఘనకు పాల్పడినా ఆర్వో చర్యలు తీసుకోలేదు. తాజాగా సర్దార్ బేగ్ చేసిన వ్యాఖ్యలపై ఆర్వో చర్యలకు ఉపక్రమించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతారా? లేదా అధికార పార్టీ సేవలో తరిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

నానిపై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

నాని ముఖ్య అనుచరుడు సర్దార్ బేగ్ నానికి చెందిన నగదు అని స్పష్టంగా పేర్కొన్నాడని, మూడు వార్డుల ఓటర్లను ప్రలోభపరిచేందుకు రూ.7కోట్ల నగదును పంపినట్టు తెలిపాడని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. అంత మొత్తంలో నగదు ఎవరిది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే విషయంలో ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సర్దార్ బేగ్ వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుని విచారణ జరిపి, ఆ మొత్తాన్ని నాని ఎన్నికల వ్యయంలో చూపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అమెరికాకు వంశీ


గన్నవరంలో మాయమై డల్లాస్‌లో ప్రత్యక్షం

- కొడుకు చదువు కోసమంటున్న అనుచరులు
- రాయబారాల కోసమంటున్న టీడీపీ నాయకులు



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ అమెరికా వెళ్లారు. వాస్తవానికి ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి అమెరికా వెళ్లడం పెద్ద సంచలనం కలిగించే అంశమేమీ కాదు. అయితే వంశీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఆయన ఏ అడుగు వేసినా అది చర్చనీయాంశంగా మారుతోంది. 2019లో టీడీపీ టికెట్‌పై గెలిచిన వంశీ ఆ తర్వాత వైసీపీ పంచన చేరారు. రాజకీయాల్లో ఇది కూడా సాధారణ విషయమే. ఆ తర్వాత ఆయన వేసిన అడుగులు ఆయన రాజకీయ ప్రస్థానాన్ని వివాదాస్పదం చేశాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కొడుకు లోకేశ్‌ను ఉద్దేశించి వంశీ చేసిన వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లోనే కాకుండా తెలుగువారందరిలోనూ వంశీపై వ్యతిరేకతను తీసుకొచ్చాయి. రాజకీయాల్లో నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం సహజమే కానీ ఇంట్లోని మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం అనే కొత్త విధానాన్ని వంశీ తీసుకొచ్చారు. ఈ పరిణామాలతో టీడీపీ అధిష్ఠానం మొదలు గ్రామస్థాయి నాయకులు వరకు వంశీ ఓటమి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా వంశీకి బలమైన ప్రత్యర్థిగా 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్ఆర్ఐ యార్లగడ్డ వెంకట్రావును తీసుకొచ్చారు. ఆయన నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీని మరింత బలోపేతం చేశారు. దీంతో 2024 ఎన్నికల్లో వంశీ ఓటమి ఖాయమని ఆయన అనుచరులే వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. ఈ ఎన్నికల్లో వంశీ ఓడిపోతే ఆ తర్వాత ఆయన పరిస్థితి ఏమిటన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వంశీ అమెరికా వెళ్లారన్న అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. వంశీ మే 17న అమెరికా వెళ్లారని ఆయన అనుచరులు చెబుతున్నారు. కొడుకు చదువుల కోసం ఆయన అమెరికాలోని డల్లాస్ వెళ్లారని అనుచరులు చెబుతున్న మాట. అయితే టీడీపీ నాయకులు దీనికి భిన్నంగా చెబుతున్నారు. వంశీ అమెరికాలో శాశ్వతంగా స్థిరపడేందుకు సిద్ధమయ్యారని అందులో భాగంగా ఆయన అమెరికా వెళ్లారన్నది టీడీపీలో కొంతమంది నాయకుల వాదన. డల్లాస్‌లోని కొందరు ఎన్ఆర్ఐల ద్వారా టీడీపీ పెద్దలతో రాజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే అమెరికా వెళ్లారని మరికొంత మంది నాయకులు చెబుతున్నారు. ఏది ఏమైనా వంశీ అమెరికా పర్యటన నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

సివిల్ సప్లయిస్ లీల.. కందిపప్పు గోల



2015-16లో డీలర్లకు కందిపప్పు అప్పుగా ఇచ్చారట

- ఆ డబ్బు కట్టాలంటూ ఉమ్మడి కృష్ణాలో డీలర్లకు నోటీసులు
- అప్పే ఇవ్వకుండా.. డబ్బులు కట్టడమేమిటని డీలర్ల గగ్గోలు
- అప్పు ఇస్తే.. ఇప్పటి వరకు ఎందుకు అడగలేదు
- రెండు ప్రభుత్వాలు మారినా.. అప్పు గుర్తుకు రాలేదా?
- డీలర్ల ప్రశ్నల వర్షం
- పక్కదారి పట్టిన వాటిని డీలర్లపై నెట్టే ప్రయత్నంగా అనుమానం

కృష్ణాజిల్లాలో నోటీసుల పర్వం ప్రారంభమైంది. అప్పుడెప్పుడో.. కందిపప్పు అప్పు మీద ఇచ్చిన దానికి 9 ఏళ్ల తరువాత ఇప్పుడు బకాయిలు కట్టాలంటూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ డీలర్లకు అధికారులు నోటీసులు ఇస్తున్నారు. కందిపప్పు తమకు ఎప్పుడు ఇచ్చారో తెలియక రెండు జిల్లాల్లో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో డీలర్‌కు సగటున రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సిందిగా నోటీసులు పంపుతుండటంతో వారిలో ఆందోళన నెలకొంటోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో డీలర్లంతా కలిపి రూ.6.90 కోట్లు కట్టాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తంగా 2300 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ఈ కందిపప్పు బకాయిలకు సంబంధించి నోటీసులు స్వీకరించిన డీలర్లు తమకు అప్పు ఇవ్వలేదని అంటున్నారు. వాస్తవానికి 2019-20లో కరోనా సమయంలో డీలర్లకు పంచదార అప్పు ప్రాతిపదికన ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఇచ్చే కమీషన్లలో ఆ మొత్తాన్ని భర్తీ చేసుకున్నారు. కానీ, విచిత్రంగా సివిల్ సప్లయిస్ శాఖ నుంచి 2015-16 మధ్య కాలంలో పెద్దనోట్ల రద్దు సందర్భంగా కందిపప్పు అప్పుగా ఇచ్చామని చెబుతోంది. దాదాపుగా పదేళ్ల తర్వాత ఎప్పుడో అప్పు ఇచ్చామని సివిల్‌సప్లయిస్ చెబుతోంది. నిజంగా అప్పు ఇచ్చి ఉంటే వెంటనే రికవరీ చేయాలి. కానీ, దాదాపుగా పదేళ్ల తర్వాత ఎందుకు అడుగుతున్నారో అర్థం కావటం లేదు. లెక్కల్లో ఏదో తేడా జరిగి ఉంటుందని, దానిని తమపై వేయటం తగదని డీలర్లు అంటున్నారు. దీంతో ఈ వ్యవహారం సివిల్ సప్లయిస్‌లో కలకలాన్ని సృష్టిస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నడిపించటానికి కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ-పోస్‌తోపాటు ఆన్‌లైన్‌లో డీడీలు కట్టే విధానంతో నగదు లావాదేవీలన్నింటినీ పూర్తిగా డిజిటల్ రూపంలోకి తీసుకొచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో నగదు లావాదేవీల్లో తేడా రావటానికి ఆస్కారం లేదు. ఒకవేళ అప్పుగా ఇచ్చినా.. ఆటోమేటిక్‌గా మరుసటి నెలలో ప్రజా పంపిణీ సందర్భంలోనైనా తెలిసిపోతుంది. కానీ, ఇప్పటి వరకు వారికి అప్పుగా తీసుకున్నట్టు తెలియదని వారి వాదనలను బట్టి అర్థమౌతోంది.

డీలర్లపై రుద్దే ప్రయత్నమేనా?

డీలర్లకు గతంలో పంచదార వంటివి అప్పుగా ఇచ్చినపుడు ఈ గొడవలు లేవు. పదేళ్ల కిందట ఇచ్చిన కందిపప్పు విషయంలోనే తేడా వస్తోంది. ఆ సందర్భంలో ఏమి జరిగి ఉంటుందన్నది అర్థం కావటం లేదు. అప్పట్లో కందిపప్పు డబ్బులు పక్కదారి పట్టాయా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. సివిల్ సప్లయిస్ శాఖలో జరిగిన అవినీతి బయటకు వస్తే పరువు పోతుందన్న ఉద్దేశంతో డీలర్లపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

అన్నీ సందేహాలే..

2015 - 16 మధ్య కాలంలో అంటే పెద్ద నోట్ల సందర్భమే. అప్పట్లో ఐదేళ్లలో ఒక ప్రభుత్వం దిగిపోయే వరకు కూడా ఈ అప్పు ఎందుకు గుర్తుకు రాలేదన్నది ప్రశ్నగా ఉంది. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆ ప్రభుత్వం కాలం కూడా పూర్తవుతోంది. ఈ ఐదేళ్ళు కూడా ఇచ్చిన అప్పు గుర్తుకు రాలేదా? దాదాపుగా 9 ఏళ్ల కాలం వరకు ఇచ్చిన అప్పు గుర్తుకు రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అప్పు తీర్చినట్టు సాక్ష్యాలు చూపాలట

వరుస నోటీసులతో డీలర్లు తాము అప్పు తీసుకోలేదని చెబుతున్నారు. ఒకవేళ నిజంగానే అప్పు ఇచ్చి ఉంటే మీరు వెంటనే చెల్లించమని డిమాండ్ చేస్తారని లేదా డీడీలకు కట్టిన తమ డబ్బును మినహాయించుకుంటారని డీలర్లు అధికారుల దగ్గర వాదిస్తున్నారు. అయితే మీరు డబ్బులు చెల్లించినట్టు రశీదులు చూపమని అధికారులు అంటున్నారు.

ఐసీడీఎస్ బకాయిల సంగతేమిటి?

రేషన్ డీపోల ద్వారా ఐసీడీఎస్‌కు నిత్యావసరాలు సరఫరా అవుతున్నాయి. 2015 నుంచి 2023 వరకు ఐసీడీఎస్‌కు సరఫరా చేసిన నిత్యావసరాల తాలూకా కమీషన్‌ను ఇప్పటి వరకు కూడా డీలర్లకు ప్రభుత్వం చెల్లించలేదు. మరి దీనికి సివిల్ సప్లయిస్ అధికారులు ఏమి సమాధానం చెబుతారు? ఈ కమీషన్‌ను ఇస్తున్నట్టు చెక్ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఆ చెక్ క్లెయిమ్ చేసుకోవటానికి డబ్బులు వేయకపోవటం గమనార్హం.

తాడోపేడో కాసేద్దాం!

కొద్దిరోజులుగా ఊగిసలాటలో బెట్టింగ్ బాబులు

● గన్నవరం, గుడివాడలో టీడీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని మెజారిటీ 15వేలు పైచిలుకు వస్తుందని విజయవాడకు చెందిన ఓ బిల్డర్ రూ.5 లక్షలకు బెట్టింగ్ కాశారు.

● మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సింహాద్రి చంద్రశేఖర్‌కు అవనిగడ్డలో మెజారిటీ వస్తుందని మచిలీపట్నంకు చెందిన ఓ రోల్డు గోల్డు వ్యాపారి రూ.10 లక్షలు బెట్టింగ్ కాశారు. ఈయనే మచిలీపట్నం ఎంపీగా కూటమి అభ్యర్థి బాలశౌరి గెలుస్తారని మరో రూ.10 లక్షలు పందెం కాశారు.



ఓటరు నాడి అంతుచిక్కకపోవడంతో కొన్ని రోజులుగా సైలెంట్ అయిన బెట్టింగ్ రాయుళ్లు మళ్లీ బరిలోకి దిగారు. పోలింగ్ ముగిసిన వెంటనే రెండు మూడు రోజులు జోరుగా మొదలైన బెట్టింగ్‌లు మధ్యలో కాస్త తగ్గాయి. ఫలితాలు తేలే రోజు దగ్గరపడుతుండటంతో మళ్లీ బెట్టింగ్ బాబులు జూలు విదులుస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ప్రస్తుతం బెట్టింగ్‌ల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారన్న దానితో సంబంధం లేకుండా కేవలం ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయి? వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఏయే సీట్లు టీడీపీ ఖాతాలో పడతాయి? ఏవి వైసీపీ దక్కించుకుంటుంది అన్న వాటిపై ఎక్కువగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.

- రెండు రోజులుగా ఊపందుకున్న బెట్టింగ్‌లు
- గన్నవరం, గుడివాడ, మైలవరం, విజయవాడ తూర్పు
- ఈ నాలుగు నియోజకవర్గాలపైనే అందరి దృష్టి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : కైకలూరు, నూజివీడుతోసహా మొత్తం 16 నియోజకవర్గాలపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. గుడివాడ, మైలవరం, గన్నవరం, విజయవాడ తూర్పు అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములపై ఎక్కువ ఆసక్తి నెలకొంది. ఈ స్థానాలపై సుమారు రూ.40 కోట్లు వరకు పందేలు జరిగి ఉంటాయని అంచనా. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 14 అసెంబ్లీ, 2 పార్ల మెంటు స్థానాలు ఉన్నాయి. వీటితోపాటు గతంలో ఉమ్మడి కృష్ణాలో ఉన్న కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలనూ కలుపుకొని టీడీపీ, వైసీపీకి ఎన్ని స్థానాలు వస్తాయన్న దానిపై బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. మొత్తం 16 స్థానాలను కూటమి క్లీన్‌స్వీప్ చేస్తుందని.. కూటమికి 14, వైసీపీకి 2 వస్తాయని.. ఇలా రకరకాల లెక్కలతో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు దగ్గరపెట్టుకుని పోలింగ్ సరళిని అంచనా వేసుకుని మరీ బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్‌కు దిగుతున్నారు.

● విజయవాడ తూర్పులో కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ మెజారిటీపైనా పందేలు నడుస్తున్నాయి. విజయవాడ పశ్చిమ, పామర్రులో వైసీపీ అభ్యర్థులు గెలుస్తారని బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. కూటమి అభ్యర్థులు గెలుపు ఖాయమని భావిస్తున్న నియోజకవర్గాల్లో మెజారిటీలపై పందేలు కాస్తున్నారు.

● పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మెజారిటీ 20వేలు పైచిలుకు ఉంటుందని పందేలు నడుస్తున్నాయి.

● విజయవాడ పార్లమెంటులో కేశినేని బ్రదర్స్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపైనా పందేలు కాస్తున్నారు. కేశినేని చిన్ని కనీసం 50వేల మెజారిటీతో గెలుస్తారని పందేలు నడుస్తున్నాయి.

గతంలో ఉన్న జోరు లేదు

గత ఎన్నికల్లో ఉన్న జోరు ఈసారి బెట్టింగ్‌ల్లో కనిపించడం లేదు. గత ఎన్నికల్లో లక్షలు దాటి కోట్లలో బెట్టింగ్‌లు నడిచాయి. 2019 ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు పరిధిలో అధికార పార్టీ తరఫున పోటీ చేసిన ఓ అభ్యర్థి తన గెలుపుపై తానే బెట్టింగ్ కట్టుకోవడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. సుమారు రూ.1.50 కోట్లకు ఆయన బెట్టింగ్ కాసినట్లు చెబుతారు. ఆయన దెబ్బతో ఆ నియోజకవర్గం నుంచే సుమారు రూ.5 కోట్లు వరకు బెట్టింగ్‌లు జరిగాయి. వీరంతా అప్పట్లో ఫలితాలు తారుమారు కావడంతో నిండా మునిగిపోయారు. అప్పట్లో టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని కూడా కోట్లలో పందేలు నడిచాయి. ఈసారి ఆ జోరు కనిపించడం లేదు. ఎన్నికలు ముగిసిన వెంటనే జోరుగా సాగిన బెట్టింగ్‌లు ఆ తర్వాత సైలెంట్ ఓటింగ్ ఎటో అర్థం కాక నెమ్మదించాయి. గత వారం రోజులుగా సాగిన విశ్లేషణల అనంతరం గత రెండు రోజులుగా మళ్లీ బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. గత ఎన్నికల సమయంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో సుమారు రూ.100 కోట్లపైచిలుకు బెట్టింగ్‌లు జరగ్గా ఈసారి అందులో సగం కూడా జరగలేదని సమాచారం.

ఉదయభాను కుమారుడు, అల్లుడి

బెదిరింపులపై ఫిర్యాదు

- స్పందించని జగ్గయ్యపేట సీఐ జానకీరాం
- ఎన్నికల కమిషన్‌కు స్వతంత్ర అభ్యర్థి వేల్పుల ఫిర్యాదు

జగ్గయ్యపేట, మే 19: వైసీపీ నేతల బెదిరింపులపై తానిచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేయటంతో పాటు, హైకోర్టును తప్పుదోవ పట్టించేలా తనకెవరూ ఫిర్యాదు చేయలేదని తెలియజేయటంపై జగ్గయ్యపేట సీఐ జానకీరాంపై జగ్గయ్యపేట నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేల్పుల విజయ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న జగ్గయ్యపేట బాలుర ఉన్నత పాఠశాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో జరిగిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను కుమారుడు కౌన్సిలర్ ప్రసాద బాబు, అల్లుడు విజయనరసింహారెడ్డి ప్రచారం చేయటంపై తాను ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తానన్నానని, అందుకు తనను వారు బెదిరించటంపై జగ్గయ్యపేట సీఐకు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు కూడా తన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని సీఐకు అధికారికంగా లిఖితపూర్వకంగా ఆదేశించినా సీఐ స్పందించలేదన్నారు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై తాను హైకోర్టులో పిల్ దాఖలు చేయగా, అసలు తాను ఫిర్యాదు చేయలేదని హైకోర్టును తప్పుదోవ పట్టించాడన్నారు. ఎన్నికల అధికారి తన ఫిర్యాదుపై స్పందించి సీఐకు ఇచ్చిన ఎండార్స్‌మెంట్ కాపీని సాక్ష్యమన్నారు. అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న సీఐపై చర్య తీసుకోవాలని, త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగే అవకాశం లేదని, సీఐపై చర్యలు తీసుకోవాలని విజయ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

అన్నవరం స్వామికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాల సమర్పణ



అన్నవరం దేవస్థానంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

వన్‌టౌన్, మే 19: తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వీరవెంకట సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మి సత్యవతీ దేవి లీలా కల్యాణోత్సవం సందర్భంగా విజయవాడ దుర్గగుడి తరఫున దేవదాయకమిషనర్ సత్యనారాయణ ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఆయనతోపాటు ఆయన వెంట ఉన్న బృందానికి అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్ మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి వేద మంత్రాల మధ్య పట్టువస్త్రాలను సమర్పించిన అనంతరం దేవదాయ కమిషనర్‌కు, ఏఈవో వెంకటరెడ్డి, వైదిక సిబ్బంది మూర్తి యజ్ఞనారాయణ, ఓగేటి రమేష్ బాబు, ఉండి శ్రీనివాస్, వేదపండితులు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనాపాటి, తంగిరాల వెంకటేశ్వర ఘనాపాటి తదితరులకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గగుడి ధర్మపథం వేదికపై...

దుర్గగుడిలో ధర్మపథం వేదికపై ఆదివారం నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ పి.ఉమామహేశ్వరుడు పాత్రుడు ఆధ్వర్యంలోని కళాకారుల బృందం వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. హావ భావ నటనలో తమ కౌశల్యాన్ని ప్రదర్శించి ఆహూతులను అలరించారు.



దుర్గగుడి ధర్మపథం వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

సీసాలు, క్యాన్లలో పెట్రోల్ విక్రయాలు వద్దు: కలెక్టర్

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6 వరకు పెట్రోలు బంకుల్లో సీసాలు, క్యాన్లలో పెట్రోలు నింపవద్దని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ ఉత్తర్వులు జారీచేసినట్టు ఆయన తెలిపారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను తప్పక పాటించాలన్నారు. పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు ఈ ఉత్తర్వులు అమలయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.



సందడిగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వన్‌టౌన్, మే 19: వన్‌టౌన్‌లోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ (2007-08) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. భవానీపురంలోని ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 16 ఏళ్ల తరువాత కలుసుకున్న ఆనందంలో అందరూ ఉత్సాహంగా గడిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులంతా గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని టి.నాగేశ్వరరావు, డి.జగదీష్, ఆర్.జైల్‌సింగ్, వి.రమేశ్, వి.భవానీ, ఆర్.ప్రసన్న తదితరులు పర్యవేక్షించారు.

మిర్చి వ్యాపారులపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు, మే 19: మిర్చి అమ్మకాల్లో నలుగురు వ్యాపారులు తమను మోసం చేశారని మండలంలోని కొల్లికుళ్ల, వెంకటాపురం గ్రామాల మిర్చి రైతులు సుమారు 50 మంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కంచికచర్ల గ్రామంలోని పెద్దబజార్, ఇందిరా కాలనీకి చెందిన మిర్చి వ్యాపారులు దొడ్డ వెంకటరామ నరసింహారావు, అతడి కుమారుడు దొడ్డ వెంకట వాసుదేవ కుమార్, వారి బంధువులు కాజా శ్రీనివాసరావు, జయిన వీరభద్రరావు పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన మద్దుకూరి వెంకటేశ్వర్లు అనే మధ్యవర్తి ద్వారా ఈ ఏడాది మార్చి నెలలో సుమారు 710 క్వింటాళ్ల మిర్చిని తమ వద్ద కొనుగోలు చేశారన్నారు. రోజులు గడుస్తున్నా తమకు రావాల్సిన నగదు సుమారు రూ.96,89,464 ఇవ్వటం లేదని మిర్చి రైతులు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌ని ఆశ్రయించారు. మిర్చి రైతులను మోసగించిన నలుగురు మిర్చి వ్యాపారులపై, మధ్యవర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ సాహితి

ఇంపికాప్స్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వర్క్‌షాప్

ధర్నాచౌక్, మే 19: ది ఇండియన్ మెడికల్ ప్రాక్టిషర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ (ఇంపికాప్స్) ఆధ్వర్యంలో నగరంలోని ఇంపికాప్స్ పంచకర్మ ఆసుపత్రిలో 'ఆయుర్వేద సద్వైద్య సంభాష పరిషద్' ఆదివారం జరిగింది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేముల భానుప్రకాష్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ క్వాలిఫైడ్ ఆయుర్వేద వైద్యులు తమ ప్రాక్టీస్‌లోని అనుభవ ఆయుర్వేద చికిత్స విశేషాలు ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాపు నిర్వహించారన్నారు. ప్రముఖ డాక్టర్ ఎస్.సాహితి మాట్లాడుతూ తన 22 ఏళ్ల వైద్య వృత్తిలో కేశ సంరక్షణ, బట్టతల, చుండ్రు వంటి విషయాల గురించి తెలిపారు. డాక్టర్ పమ్మి సూర్యకుమార్, డాక్టర్ ప్రియాంక, రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పశువైద్య సేవలకు యూజర్ చార్జీలు సహించం

- ఏపీ రైతుసంఘం రాష్ట్ర నేతలు

ధర్నాచౌక్, మే 19: పశుసంవర్థక శాఖ అందిస్తున్న సేవలకు డబ్బులు వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జిఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ పేదలు, చిన్న, సన్నకారు రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరిని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం వారిపైనే భారాలు మోపడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా పాడి రైతులు, పశుపోషకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పశు వైద్యసేవలపై రుసుము వసూలు చేసే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాడిరైతులను ప్రోత్సహించేందుకు విధానపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ప్రతిజ్ఞ


కృష్ణాజిల్లా ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్

జిల్లా నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, మే 19: కృష్ణాజిల్లా ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్ నూతన అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన కే సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం ఈశ్వర్ రెసిడెన్సీలో మచిలీపట్నం రీజియన్ ఎస్‌బీఐ గోల్డ్ అప్రయిజర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన కే సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా మచిలీపట్నానికి చెందిన పి.ధనుంజయ్, కోశాధికారిగా ఉనికిలికి చెందిన ప్రదీప్ ఎన్నికయ్యారు. మచిలీపట్నానికి చెందిన అలుగోజు శేఖర్‌ను జిల్లా కన్వీనర్‌గా, ఉపాధ్యక్షుడిగా పూర్ణాచారి, సంయుక్త కార్యదర్శిగా మనోజ్, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, రాజగోపాలాచారి, వెంకటరత్నం, భాస్కరరావు, రవీంద్రను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ కొండలరావు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి ప్రసంగించారు. మచిలీపట్నం రీజియన్ పరిధిలో 40 పైగా ఎస్‌బీఐ శాఖలున్నాయని, వాటిల్లో పనిచేస్తున్న అప్రయిజర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను జాయింట్ ఉద్యోగుల సంఘ నేతలతో చర్చిస్తామన్నారు. సెకండ్ అప్రయిజర్ చార్జీలు రూ.3వేలు చెల్లించాలన్నారు. అప్పలాచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక, మే 19: కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టర్ ఢిల్లీరావు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో నిరంతర నిఘాతో పటిష్టమైన మూడంచెల భద్రత ఉందన్నారు. ఆయా ప్రాంతాలన్నీ నిరంతరం సీసీ కెమేరాల ద్వారా 24 గంటలూ పర్యవేక్షించాలన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను స్ట్రాంగ్ రూంల పరిసరాల్లో ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు ఉండాలన్నారు. బారికేడ్లు, మెష్‌లు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఇతర లెక్కింపు సిబ్బంది వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కేంద్రంలో అసెంబ్లీకి, పార్లమెంట్‌కు చెరో 14 టేబుల్స్ చొప్పున 28 టేబుల్స్‌తోపాటు తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల కేసుల విచారణ

త్వరగా పూర్తిచేయండి

- కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

మచిలీపట్నం టౌన్, మే 19: ఎన్నికల ఆధారిత కేసులను త్వరగా విచారణ పూర్తిచేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలక్షన్ ఆధారంగా నమోదైన ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డీఎస్పీలు తమ డివిజన్ పరిధిలోని కేసులను ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికలు ప్రక్రియను ప్రశాంతంగా పూర్తిచేశామని, అలాగే కౌంటింగ్ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వెంకటేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న గోష్టిగానం

విజయవాడ కల్చరల్, మే 19: 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు.. చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు'... అంటూ సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి పంచరత్న కృతులను గోష్టిగానం చేసి శ్రోతలను పరమానంద భరితులను చేశారు. శ్రీ త్యాగరాజ స్వామి 257వ జయంత్యుత్సవాల్లో భాగంగా చివరి రోజు సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఆదివారం పంచరత్న గోష్టి నిర్వహించారు. సద్గురు సంగీతోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. త్యాగరాజ స్వామి విరచిత ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానంతో సంగీత ప్రియులను అమృత రసరాగ ప్రవాహంలో మునకలు వేయించారు. తొలుత నాట రాగం ఆదితాళంలో 'జగదానందకారక జయ జానకీ ప్రాణ నాయకా' అంటూ పంచరత్నాలులో తొలి కృతిని పాడి జనరంజకం చేశారు. వెంటనే గౌళరాగం ఆదితాళంలో 'దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో కడు దుర్విషయాకృష్ణుడై గడియ గడియకు నిండారు' అంటూ రెండో కృతిని పాడి ఆహుతులను అలరించారు. తదుపరి ఆరభి రాగం ఆదితాళంలో 'సాధించెనే ఓ మనసా బోధించిన సన్మార్గ వచనములంటూ ప్రారంభించి' సమయానికి తగు మాటలాడెనే దేవకీ వసుదేవుల నేగించినట్లు' అనుపల్లవితో సాగిన ఈ కృతిగానం సుధారసాలను ఒలికించింది. వరాళిరాగం ఆదితాళంలో 'కనకన రుచిరా కనకవసన...నిన్ను దిన దినమున మనసున చదువున' కృతిని పాడి సంగీత విద్వాంసుల బృందం కరతాళధ్వనులు అందుకొంది. చివరిగా ఎందరో మహానుభావులు కీర్తన గానం చేసి పంచరత్న గోష్టి గానానికి ముక్తాయింపు పలికారు. బృందగానంలో సంగీత విద్వాంసులు పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, కచేరిలో పాల్గొన్నారు. మంగళంపల్లి స్వర్ణ, ఎన్‌సీహెచ్ బుచ్చయాచార్యులు శిష్య బృందం, ఎ.మృత్తిక, తుమ్మల శ్రీలత, చిట్టా దీపక్, సీఎన్ఎస్ త్రిశ్య, ఎన్.భవ్యశ్రీ గీతిక, ఎన్‌జీఎస్ కీర్తన, సాత్విక మోహన్, చిట్టా కార్తీక్, సీవీపీ శాస్త్రి, మల్లాది సోదరులు, వి.కృష్ణవేణి, బీవీఎస్ ప్రసాద్, షణ్ముఖ శ్రీవత్స, హేమాద్రి చంద్రకాంత్, కె.అరవింద్, కె.సుబ్రహ్మణ్య రాజు, కస్తూరి భార్గవ్, మొదలి కృష్ణసాయి, సిహెచ్.సూర్య, బీవీఎస్ కృష్ణ తదితరులు తమ గాత్ర వాద్య కచేరీలతో బృందగానంలో పాల్గొన్నారు. త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనల గానానికి చింత రవి బాలకృష్ణ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



పంచరత్న గోష్టిగానంలో పాల్గొన్న సంగీత విద్వాంసులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌వో శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఎయిడ్స్ వ్యాధిని అంతం చేద్దాం

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు

కృష్ణలంక, మే 19: ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, ఎయిడ్స్ రహిత సమాజానికి కృషితో పాటు బాధిత కుటుంబాలకు అండగా ఉందామని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు అవుదామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా మే నెల 3వ ఆదివారం కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణాధికారి ఉషారాణి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి కారణంగా జిల్లాలో గతేడాది 661 మంది మృతిచెందారన్నారు. వారికి, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకొనేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లాలో 7 హెచ్ఐవీ నిర్ధారణ కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలు చేస్తున్నామని, 75 ప్రభుత్వాసుపత్రులు, 10 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలందిస్తున్నారన్నారు. జిల్లాలో 17,505 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులున్నారని వీరిలో సుమారు 1800 మందికి ప్రతినెల రూ.2,250 ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అనంతరం బలమైన సమాజ నిర్మాణానికి హెచ్ఐవీ బ్యాధితో జీవిస్తున్న వారి పట్ల ప్రేమతో సంఘీభావం తెలుపుతానని బాధ్యత కలిగిన పౌరుడిగా పరిపూర్ణ చైతన్యం అవగాహనతో బాధ్యతాయుతమైన ప్రవర్తనతో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిని అరికట్టేందుకు మనసావాచా, కర్మణతో ముందుంటానని ప్రతిజ్ఞ చేయించారు. డీపీఎం పి.కిరణ్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ ఎ.రమేష్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఏఎస్సై దుర్మరణం



ఇబ్రహీంపట్నం, మే 19: స్థానిక విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై రమణ (62) మృతిచెందారు. విజయవాడ సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన రమణకు జూపూడి చెక్‌పోస్టు వద్ద డ్యూటీ వేశారు. శనివారం రాత్రి వచ్చిన ఆయన రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడగా విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. రమణ ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్నారు. ఇంతలోనే రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, తోటి పోలీసులు కన్నీటిపర్యంతమయ్యారు.

సీపీ రామకృష్ణ నివాళి

గుణదల: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఎస్సై ఎన్‌వీవీ రమణ మృతదేహానికి విజయవాడ సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ నివాళులర్పించారు. ఆదివారం పటమటలోని రమణ స్వగృహానికి చేరుకున్న ఆయన రమణ పార్థివదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు మానసిక స్థైర్యం ఇవ్వాలని పోలీసు శాఖాపరంగా రమణ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసు అధికార లాంఛనాలతో ఏఎస్సై ఎన్‌వీవీ రమణ మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. డీసీపీ టి.హరికృష్ణ, ఎస్‌బీ ఏడీసీపీ టి.కనకరాజు, సీసీఎస్ ఏసీపీ స్రవంతి రాయ్, ఏఆర్ ఏసీపీ డి.ప్రసాద్, సీఐలు ఎం.సత్యన్నారాయణ, మోహన్ రెడ్డి, ప్రసాద కుమార్, లక్ష్మీనారాయణ, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.



రమణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ

జూడో క్రీడలో మౌలిక వసతులకు ప్రణాళిక

ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్‌గా నాగూరయ్య ఎన్నిక

విజయవాడస్పోర్ట్స్, మే 19: రాష్ట్రంలో జూడో క్రీడకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రతి జిల్లాలో మౌలికవసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ ఆడవరపు నాగూరయ్య వెల్లడించారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ సహ తొమ్మిది మందితో ప్రత్యేక కమిటీని ఆదివారం ఎగ్జిక్యూటివ్, జనరల్ బాడీ సమావేశాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్, ప్రెసిడెంట్ గణేశ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ ఎన్.పవన్ సందీప్, ట్రెజర్ టీవీవీ.రమణ పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ నాలుగేళ్ల తన పదవీ కాలంలో జిల్లాలో జూడోకు మౌలిక వసతులను కల్పిస్తామని, విజయవాడ కేంద్రంగా అకాడమీ ద్వారా ప్రతిభ గల క్రీడాకారులు 60 మంది ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. 2025లోగా ఏపీలో జాతీయ జూడో చాంపియన్‌షిప్ నిర్వహించాలని, 2029లోగా అంతర్జాతీయ ఈవెంట్ ఇండియా ద్వారా ఏపీలో నిర్వహణకు సమయాత్తం కావాలని జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించామన్నారు. అలాగే జూడో అభ్యసనపై ప్రసారమాధ్యమాల్లో విస్తృతప్రచారం, శిక్షణలో గాయపడిన క్రీడాకారులకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేకంగా ఒక అత్యాధునిక ఆసుపత్రి నిర్మించాలని ఈ సమావేశంలో తీర్మానించినట్లు వివరించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై నూతన కమిటీని అభినందించారు.

కమిటీ: ఏపీ చైర్మన్‌గా ఆడవరపు నాగూరయ్య(తిరుపతి), వైస్ చైర్మన్‌గా ఉప్పలపాటి హరిప్రసాదరాజు, చీఫ్ ప్యాట్రన్‌గా జొన్నలగడ్డ శైలజ, సభ్యులుగా కె. అశోక్‌కుమార్, సీహెచ్ అప్పాజీ, డాక్టర్ ఎ.అనుదీప్, కె.ధనుంజయవర్మ, పి.మల్లికార్జునరెడ్డి, ఆర్.రమేష్ నాయుడు, కె.రోషన్ బాలచంద్రన్, బి.సుబ్రహ్మణ్యం.



నాగూరయ్యను అభినందిస్తున్న సీఈవో వెంకట్, ఇతర సభ్యులు

ఇసుక దోపిడీదారులెవరు..?

- కీసర స్టాక్ యార్డుపై ప్రభుత్వ పెద్దల కన్ను
- కేసు కూడా నమోదు చేయని పోలీసులు
- తూతూమంత్రపు దాడులతో సరి

కంచికచర్ల, మే 19: కీసర స్టాక్ యార్డులో ఇసుక అడ్డగోలు దోపిడీకి అధికార పార్టీ నేతల వత్తాసు ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. పెద్దల ఒత్తిడి వల్లే పోలీసులు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని అంటున్నారు. ఇసుక దోపిడీ గురించి మీడియాలో కథనాలు వస్తున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, పోలీస్, సెబ్ అధికారుల నుంచి స్పందన శూన్యం. ఈ దోపిడీ వెనుక అధికార పార్టీ పెద్దల హస్తం ఉందన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. అంతకుముందు కంచికచర్ల మండలం మున్నలూరు రీచ్‌లో, చందర్లపాడు మండలం కాసరబాద, ఏటూరు రీచ్‌లో పెద్దలు అడ్డగోలుగా తవ్వకాలు సాగించారు. ప్రస్తుతం స్టాక్ యార్డు ఇసుక కూడా పెద్దల అండతోనే దోచేస్తుండటంతో అధికారులు జంకుతున్నారని అంటున్నారు. శనివారం రాత్రి కంచికచర్ల పోలీసులు యార్డుపై దాడి చేసి, ఒక లారీని, భారీ యంత్రాన్ని పట్టుకున్నారు. అప్పటికప్పుడు లారీని కంచికచర్ల మార్కెట్ యార్డుకు తరలించారు. భారీ యంత్రాన్ని బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేకపోవటంతో అక్కడే వదిలేసి, తాళాలు వేసి ఇద్దరు ఆపరేటర్లనూ అదుపులోకి తీసుకున్నారు. అయితే, దీనిపై ఎలాంటి కేసు లేదు. పెద్దల ఒత్తిడి వల్లే పోలీసులు కేసు నమోదు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు

ఉంగుటూరు, మే 19 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు మండల పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉంగుటూరు, ఆత్కూరు ఎస్సైలు వి.రవిచంద్రకుమార్, ఏ.ఫైడిబాబు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జూన్ 6వ తేదీ వరకు మండల వ్యాప్తంగా 144సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలులో వుంటుందని, మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన తర్వాత శాంతిభద్రతల స్థితిగతులను పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 27 గ్రామాల్లో 144వ సెక్షన్, 30పోలీస్ యాక్ట్ అమలులో వున్నందున ప్రధాన కూడళ్లు, రోడ్లపక్కన, వీధుల్లో నలుగురికి మించి గుమికూడరాదని, మండలంలో అన్నిరకాల దుకాణాలు, షాపులు, రాత్రి 9 గంటలకే మూసివేయాలని పేర్కొన్నారు.



నానిని పరామర్శిస్తున్న బోడె ప్రసాద్

వైసీపీ మూక దాడిలో గాయపడ్డ పులివర్తి నానికి బోడె పరామర్శ

పెనమలూరు, మే 19 : మే 13న జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం వైసీపీ మూకలు చేసిన దాడుల్లో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న చంద్రగిరి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని పెనమలూరు కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. నానీపై జరిగిన దాడి వివరాలను అడిగి తెలుసుకొని ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండించాలని కోరారు. బోడె వెంట టీడీపీ నాయకులు చెన్నుపాటి శ్రీనివాస్ ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు



సదస్సుకు హాజరైన సభ్యులు

పెనమలూరు, మే 19 : వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వేసవికాలంలో వచ్చే చర్మ సమస్యలు, పిల్లల్లో తరచుగా వచ్చే ఎదుగుదల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీక్లినిక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ ప్రవల్లిక తాళ్లూరి మాట్లాడుతూ, వేసవి కాలంలో చర్మ సమస్యలు రాకుండా జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ కిరణ్‌రోహిత్ మాట్లాడుతూ, పిల్లలు వేళ్ల చీకడం, మాటలు ఆలస్యంగా రావడం, నత్తి, శబ్దాలను గుర్తించకపోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర తదితరులు పర్యవేక్షించారు.

బాబాకు లక్ష గులాబీల అర్చన



గండిగుంట(ఉయ్యూరు), మే 19 : వైశాఖమాస శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం షిర్డీ సాయి బాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు లక్ష గులాబీలతో అర్చన, అభిషేకం జరిపించారు. మహిళా భక్త బృందం భజనలు భక్తులను ఎంతగానో పరవశులను చేశాయి. ఆలయ కమిటీ బాబ్జి, బొప్పిడి ఉషా రామకృష్ణ, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మండవ జయదేవ్ తదితరులు పాల్గొని సేవలందించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు.

నిస్వార్థ కమ్యూనిస్టు విజయ్‌కుమార్

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

ఈడుపుగల్లు (కంకిపాడు), మే 19 : నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు విజయ్‌కుమార్ అని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఈడుపుగల్లులో విజయ్ కుమార్ సంస్మరణ సభ సీపీఐ సీనియర్ నాయకులు వెలగపూడి ఆజాద్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై విజయ్‌కుమార్ నిరంతరం ఉద్యమిస్తూ వచ్చారన్నారు. సీపీఐ, వ్యవసాయ, కార్మికసంఘం, దళిత హక్కుల పోరాట సమితి కార్యక్రమాల్లో అన్ని స్థాయిల్లో పాల్గొన్నా రని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, ముప్పాళ్ల భార్గవశ్రీ, కోటేశ్వరరావు, నాగుల్ మీరా, జమలయ్య, రాయప్ప, చంద్రా నాయక్, మున్నం నరసింహారావు, మర్రి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న బషీర్

గన్నవరం, మే 19 : పేద విద్యార్థులను ఆదుకోవటం మానవ ధర్మమని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అన్నారు. స్థానిక రాయనగర్‌కు చెందిన తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న సుస్మితకు బషీర్ ల్యాప్‌టాప్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ, చదువుకు పేదరికం అడ్డంకి కారాదన్నారు. చదువులో రాణించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు వెతుక్కుంటూ వస్తాయని తెలిపారు. సుస్మిత తండ్రి ఆకస్మికంగా మృతి చెందటంతో ఇబ్బందులు పడుతున్న ఆమెకు అండగా నిలవటం అభినందనీయమన్నారు. స్పందన మానసిక వికాస కేంద్రం సెక్రటరీ సంకాబత్తుల రజిత తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సోమూరి వెంకట్రావ్ అన్నారు. పెరిశేపల్లిలో కృష్ణ ఫౌండేషన్‌కు చెందిన వృద్ధాశ్రమంలో ప్రవాస భారతీయులు స్వప్న విష్ణువర్ధన్, వైద్య విద్యార్థి అజితేష్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం సీనియర్ సిటిజన్ సోమూరి ధర్మారావు (101) ప్రారంభించారు. 300 మందికి వైదపరీక్షలు నిర్వహించి దాదాపు రూ.4లక్షల విలువ గల మందులను పంపిణీ చేశారు.

టీడీపీ నేతలపై దాడులు హేయం

కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



ఆళ్ల గోపాలకృష్ణను పరామర్శించి మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 19 : శాంతియుతంగా ఉండే గన్నవరం నియోజకవర్గంలో అక్రమ కేసుల సంస్కృతితో పాటు భౌతికదాడులు చేయడం హేయమైన చర్యని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగన్నగూడెంలో టీడీపీ నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణను ఆదివారం ఆయన పరామర్శించారు. దాడి జరిగిన తీరును ఆళ్ల గోపాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో కొత్తమల్లవల్లిలో ఆళ్లపై దాడిని ఆయన ఖండించారు. నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఆళ్ల పోలింగ్ రోజు దాడికి గురవడం బాధాకరమన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ఓటరు గుర్తింపు కలిగిన ఓటర్లను అడ్డుకోవడమే కాక ఓటర్ల జాబితాలో పేరు, ఓటరు గుర్తింపు కార్డు కలిగిన వారికి ఓటు వేయనివ్వకపోవడం ప్రజాహక్కులకు భంగం కలిగించడమేనన్నారు. ఈ విషయమై అడిగిన చీఫ్ ఎన్నికల ఏజెంట్ ఆళ్లపై భౌతిక దాడి చేయడం హేయమన్నారు. ఎన్డీయే కూటమి ఏర్పడిన వెంటనే అసాంఘికశక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతలను పునరుద్ధరించేలా కృషి చేస్తామన్నారు. తదనంతరం ఇటీవల హనుమాన్‌జంక్షన్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి మృతి చెందిన వెనిగళ్ల శ్రీనివాసరావు కటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, తుమ్మల దశరథరామయ్య, టీడీపీ నాయకులు మొవ్వా వేణుగోపాల్, తుమ్మల ఉదయ్, మొవ్వా శ్రీనివాసరావు, దోనవల్లి నాగశిరోమణి, కొండపల్లి వెంకన్న, గండేపూడి నితీష్‌కుమార్, పల్లగాని వీరాంజనేయులు, గరికపాటి శంకర్, అనంద్, బెజవాడ వెంకట కృష్ణారావు, వెనిగళ్ల జ్ఞానశేఖర్, ఆలూరి సురేష్, బొకినాల సాంబశివరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల జోరు!

● పెనమలూరు మండలంలో 24 గంటలూ మద్యం అందుబాటులో ● ఎన్నికల్లో పంచగా మిగిలిన మందు బెల్టుషాపుల్లోకి ● క్వార్టరుకు అదనంగా రూ. 60 వసూలు ● బందరు రోడ్డుకిరువైపులా పలు హోటళ్లలో మద్యం అమ్మకాలు

పెనమలూరు, మే 19 : మండలంలోని బెల్టు షాపుల్లో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. పెనమలూరులో ఏ మూల వెతికినా మద్యం చిటికెలో లభిస్తోంది. పెనమలూరు వంతెన, తాడిగడప పాతవంతెన, పోరంకి సెంటరు, యనమలకుదురు లాకులు, సాలిపేట, పోరంకి స్మశానం రోడ్డు, కామయ్యతోపు సెంటరు తదితర ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపుల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసిన వెంటనే బెల్టు షాపుల నిర్వాహకులు నడిరోడ్డుపైనే మొబైల్ మద్యం దుకాణాలకు తెరలేపుతున్నారు. మోటారుసైకిళ్లపై వచ్చిన వ్యక్తులు తమ జేబుల్లోంచి మద్యం బాటిళ్లు తీసి విక్రయిస్తున్నారు. క్వార్టరు బాటిల్‌కు కనీసం అరవై రూపాయలు తక్కువ కాకుండా అమ్ముకుంటున్నారు. మొన్నటి ఎన్నికలలో రాజకీయ పార్టీలు ఓటర్లకు పంచగా మిగిలిపోయిన తెలంగాణ, గోవా, కర్నాటక మందు బెల్టు షాపుల నిర్వాహకుల వద్ద విరివిగా లభ్యమవుతోంది. స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది కూడా బెల్టు షాపుల నిర్వాహకులకు సహకరిస్తుండంతో దుకాణాల్లోని క్వార్టరు సీసాలు బెల్టుషాపులకు చేరుతున్నాయి. మరో పక్క పెనమలూరు సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. ప్రభుత్వ దుకాణాల వద్ద హోటళ్లకు, బడ్డీకొట్లకు అనుమతులు లేకపోయినా మద్యం కొనుక్కొన్న వ్యక్తులు అక్కడే మద్యం సేవిస్తుండడం వివాదాలకు తావిస్తోంది. మరో పక్క బందరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లలో మద్యం సేవించడం మామూలయింది. కొన్ని హోటళ్లలో సిబ్బంది స్వయంగా మద్యాన్ని సరఫరా చేయడం, దానికి తగ్గట్లు అధిక మొత్తంలో బిల్లులు బాది వసూలు చేయడం పరిపాటిగా మారింది. హైవే ప్రక్కన హోటళ్లలో అర్ధరాత్రి వరకూ మద్యం అందుబాటులో ఉండడం విశేషం. ప్రస్తుత సీఐ రామారావు బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో కొంతవరకు బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపినా మళ్లీ మొదటికి వచ్చింది. బెల్టు షాపులను నిరోధించడం, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని మద్యం ప్రక్క తోవ పట్టకుండా నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం ఆలోచింపదగ్గ విషయం. ఇకనైనా బెల్టు షాపుల నిర్వాహకులకు ముకుతాడు వేసేలా స్థానిక పోలీసు యంత్రాంగం, ఆబ్కారీ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పమిడిముక్కల : మంటాడ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధికారి మాధవీలత పర్యవేక్షించారు.

మనోవికాసానికి పుస్తకపఠనం అవసరం



ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శ్లోకాలు నేర్పుతున్న హయగ్రీవ రాఘవ

ఉంగుటూరు, మే 19 : విద్యార్థుల మనోవికాసానికి, విజ్ఞానాభివృద్ధికి పుస్తకపఠనం ఎంతో అవసరమని, అజ్ఞాన గాడాంధకారాన్ని తొలగించి సుజ్ఞాన జ్యోతిని వెలిగించడంలో పుస్తకపఠనానికి మించిన దివ్యౌషధం మరొకటి లేదని తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ గ్రంథాలయాధికారులు బి.శ్రీనివాసరావు, బీవీ కృష్ణారావు, యు. చంద్రశేఖరరావు, ఎల్.హరికృష్ణ పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాల్లో భాగంగా ఆదివారం మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనంవల్ల కలిగే ప్రయోజనాలు, గ్రంథాలయాల ఉపయోగాల గురించి గ్రంథాలయాధికారులు వివరించారు. ఆత్కూరు గ్రంథాలయంలో రిసోర్స్‌పర్సన్ సిహెచ్ ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ గ్రామర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని గ్రంథాలయాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో..

ఉయ్యూరు : దేశ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలపై చిన్న నాటి నుంచి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఆచార్యులు పి. హయగ్రీవ రాఘవ అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు వేమన పద్యాలు, శ్లోకాలు నేర్పించారు. ఈ సందర్భంగా దేశ సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించి అవగాహన కల్పించారు. గ్రంథాలయాల వల్ల ప్రయోజనాలు తెలియజేశారు. శిక్షణ శిబిరం ఉద్దేశాన్ని శాఖా గ్రంథాలయ అధికారి రమణి తెలియజేశారు.

ఆదర్శనీయుడు సుందరయ్య

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు

గన్నవరం, మే 19 : నేటి రాజకీయాలకు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో టీవీ లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎర్ర జెండాతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అదే ఒరవడిని పుచ్చలపల్లి సుందరయ్య అనుసరించి అందరికి మార్గదర్శకులు అయ్యారన్నారు. పేదల పక్షాన నిలబడి నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి సైకిల్ పై వెళ్లారని గుర్తుచేశారు. వైసీపీ, టీడీపీలు కులాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూశాయన్నారు. సీపీఎంకు ఓటు వేసేవారిని అదిరించి, బెదిరించారన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతుందన్నారు. దానిలో భాగంగానే కాంగ్రెస్ పార్టీపై లేనిపోని నిందలు మోపుతుందని మండిపడ్డారు. దేశంలో బీజేపీకి 200 సీట్లు రావని సర్వేలు చెబుతున్నాయన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం సీపీఎం శ్రేణులు విశేష కృషి చేయాలని చెప్పారు. సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, గన్నె వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి పుచ్చలపల్లి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసేవాడే నాయకుడని నిరూపించి నిరాడంబరంగా జీవిస్తూ త్యాగాలతో పోరాటాలకు స్ఫూర్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ అన్నారు. బండారుగూడెంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతల రాము, బొకినాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పుచ్చలపల్లి



ఉయ్యూరులో మాట్లాడుతున్న రాజేశ్

ఉయ్యూరు : నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిస్వార్థసేవతో కడవరకు సమసమాజం కోసం పోరాటాలు చేసిన ఆదర్శ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య అని పలువురు సీపీఎం నాయకులు కీర్తించారు. పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి పురస్కరించుకుని ఉయ్యూరులో మానికొండ సుబ్బారావు, సూర్యావతి శ్రామిక భవన్‌లో ఆదివారం పట్టణ పార్టీ ఆ ధ్వర్యంలో ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకుడు అట్లూరి రామచంద్రరావు పూలమాలవేసి నివాళులర్పించారు. సుందరయ్య ఆదర్శభావాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి బి. రాజేశ్, కమిటీ సభ్యులు పి. లక్ష్మణరావు, బి. కీర్తి, ఎస్‌కె ఇస్మాయిల్, నిమ్మాది గోపాల్, బుల్లియ్య, అన్నే సుబ్బారావు తదితరులు సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సుందరయ్యకు ఘన నివాళి

పెనమలూరు : దివంగత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు, పోరంకి పార్టీ కార్యాలయాల వద్ద నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సీపీఎం కార్యదర్శి నరసింహారావు, ఉప్పాడ త్రిమూర్తులు, నార్ని వెంకట్రావు, అన్నవరపు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, మరీదు భాస్కరరావు, సత్యనారాయణ, అమరయ్య శాస్త్రి, గోపిరెడ్డి, ఉయ్యూరు వెంకట్రావు, రాంబాబు, సోమశేఖర్, మోహన్, పోతులూరి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, వై సరళ, వీసం రవణమ్మ, సూర్యవతి పాల్గొన్నారు.



తాడిగడప మునిసిపాలిటీలో..



వైటథాన్ వాక్‌లో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది

కంటి కేన్సర్‌పై అవగాహన

పెనమలూరు, మే 19 : రెటినోబ్లాస్టోమా అనే కంటి కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం వైటథాన్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది మాట్లాడుతూ, కంటి కేన్సర్‌పై అవగాహన కోసం గత రెండేళ్లుగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి కేన్సర్ అత్యంత ఖరీదుతో దీర్ఘకాలం నిర్వర్తించవలసిన చికిత్స అని, అందువల్ల వైటథాన్ వాక్ ద్వారా సేకరించిన విరాళాలు కేన్సర్ చికిత్సకు అవసరమయిన ఆర్థికస్థితి లేని పిల్లల వైద్యానికి ఉపయోగిస్తున్నామన్నారు. ఈ విరాళాలు రెండువేల మందికిపైగా పిల్లలకు వినియోగిస్తున్నామన్నారు. గత దశాబ్ద కాలంగా ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో అరవై శాతం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని, వార్షికంగా షుమారు రెండు వందల కేన్సర్ కేసులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ వాక్‌ను ఆసుపత్రి ప్రాంగణం నుంచి 5 కిమీ, 3 కిమీ రెండు కేటగిరీలలో నిర్వహించామని తెలిపారు.

గాయని జొన్నలగడ్డ మాధవికి బంగారు పతకం

మచిలీపట్నం టౌన్, మే 19 : మధురగాయని, లక్ష్మీ పురస్కార గ్రహీత జొన్నలగడ్డ మాధవి భగవద్గీత పఠనంపై చేస్తున్న సేవలను గుర్తించి మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. మైసూరు ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో మాధవితో పాటు సిహెచ్ శ్రీదేవి, తదితరులను బంగారు పతకాలతో సత్కరించారు. టీటీడీ ధర్మప్రచారిణిగా ఉంటూ పలు దేవాలయాలు, పాఠశాలల్లో భగవద్గీత శ్లోకాలపై మాధవి ఉపన్యాసాలు ఇస్తున్నారు. విద్యార్థులకు రామాయణ, మహాభారత, మహాభాగవత కథలను వినిపిస్తున్నారు. ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

వెంట్రప్రగడలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పెదపారుపూడి : వెంట్రప్రగడలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. 30 మంది దంపతులు పీటల మీద కూర్చుని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన జాజుల శ్రీనివాసరావు, పుసునూరి వెంకయ్య, మరి కొంతమంది దాతల సహకారంతో 1500 మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

కొండాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు, మే 19 : వేమవరం కొండాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పాల పొంగళ్లు సమర్పించి, ముడుపులు చెల్లించుకొన్నారని ఆయన తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు సురేష్ బాబు తెలిపారు.

గాయని మాధవికి బంగారు పతకం

● ప్రశంసాపత్రంతో సత్కరించిన గణపతి సచ్చిదానంద స్వామి



ప్రశంసాపత్రం అందుకుంటున్న టీటీడీ ధర్మచారిణి జొన్నలగడ్డ మాధవి

మచిలీపట్నం టౌన్, మే 19 : మధురగాయని, లక్ష్మీ పురస్కార గ్రహీత జొన్నలగడ్డ మాధవి భగవద్గీత పఠనంపై చేస్తున్న సేవలను గుర్తించి మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. మైసూరు ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో మాధవితో పాటు సిహెచ్ శ్రీదేవి, తదితరులను బంగారు పతకాలతో సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారిణిగా ఉంటూ పలు దేవాలయాలు, పాఠశాలల్లో భగవద్గీత శ్లోకాలపై మాధవి ఉపన్యాసాలు ఇస్తున్నారు. విద్యార్థులకు రామాయణ, మహాభారత, మహాభాగవత కథలను వినిపిస్తున్నారు. ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. బంగారు పతకం అందుకున్న సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ సేవకులు తుర్లపాటి ప్రసాద్, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మాధవిని అభినందించారు.

విజ్ఞాన సముపార్జనపై ఆసక్తి చూపాలి



చిన్నారులతో నీతి కథల పుస్తకాలను చదివిస్తున్న గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి

పామర్రు : విజ్ఞాన సముపార్జనపై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని గ్రంథాలయాధికారి ఝాన్సీ రాణి అన్నారు. పామర్రు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చిన్నారులకు ఆదివారం పుస్తక పఠనం పట్ల అవగాహన కల్పించారు. దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రీడాకారుల్ని ఆదర్శంగా తీసుకుని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. జమీగోల్వేపల్లి గ్రంథాలయంలో పిల్లలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను లైబ్రేరియన్ సురేష్ నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

వెంట్రప్రగడలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పెదపారుపూడి : వెంట్రప్రగడలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. 30 మంది దంపతులు పీటల మీద కూర్చుని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన జాజుల శ్రీనివాసరావు, పుసునూరి వెంకయ్య, మరి కొంతమంది దాతల సహకారంతో 1500 మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పమిడిముక్కల : మంటాడ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధికారి మాధవీలత పర్యవేక్షించారు.

స్వచ్ఛంద సంస్థల సేవ అభినందనీయం



పేదలకు అన్నదానం చేస్తున్న బాలాజీ తదితరులు

మచిలీపట్నం టౌన్ : సమాజంలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎస్‌బీఐ విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజరు ఎల్ఎస్ఎస్‌విడి హనుమంతరావు అన్నారు. లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ముస్తాఖాన్‌పేట దేవుడు తోట ఎస్టీ కాలనీలో 250 మందికి ఆదివారం అన్నదానం చేశారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హనుమంతరావు మాట్లాడుతూ, లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న వి.శ్రీకాంత్, లంకిశెట్టి దీప్తి, ఆశ్రిత సహకారంతో ఆకలితో ఉన్న ఎస్టీ కాలనీలో పేదవారికి ఆకలి తీర్చడం దేవుడు సేవతో సమానమన్నారు. సర్కిల్ కన్వీనర్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, కాలేఖాన్‌పేట మునిసిపల్ హైస్కూల్‌లో ఎస్టీ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి 475 మార్కులు సాధించడం మంచి పరిణామమన్నారు. 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, నీరజ, రమేష్, రామాంజనేయులు, పవన్, తన్మయి, ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

పాపవినాశనం యువత స్వచ్ఛంద సేవ



ట్రాక్టర్‌తో ఇసుక మేటను తొలగిస్తున్న యువకులు

ఘంటసాల : పాపవినాశనం గ్రామంలోని కరకట్ట రహదారిపై ఇసుక మేట వేసి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా వర్షాలు పడటంతో రహదారిపై పలువురు వాహనదారులు అదుపు తప్పి పడిపోవటంతో గాయాలయ్యాయి. గ్రామ యువత స్పందించి ట్రాక్టర్ సహాయంతో ఇసుక మేటలను తొలగించారు. వాహనదారుల ఇబ్బందులు గమనించి ఇసుక మేట తొలగించిన యువకులకు గ్రామస్థులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్చకస్వామి వెంకట రామాచార్యులు కన్నుమూత



అవనిగడ్డ, మే 19 : లక్ష్మీనారాయణస్వామి పాదార్చకులు, వైఖానస ఆగమ పండితులు దీవి వెంకట రామాచార్యులు (85) ఆదివారం ఉదయం స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత రెండు నెలలుగా హృద్రోగంతో చికిత్స పొందుతున్నారు. పెదకళ్లేపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, అర్చక సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ టి.ఫణికుమార్, సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్.టి.అనంతాచార్యులు, అధ్యక్షుడు ఆత్రేయ బాబు, ఉపాధ్యాయ సంఘం నేతలు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి



నాగాయలంక : అంతర్జాతీయ ఎయిడ్స్ మృతుల స్మారక దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. సభ్యులతో కలసి సంస్థ కార్యదర్శి మద్దాల కోటేశ్వరమ్మ కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి ఎయిడ్స్ బారిన పడి చనిపోయిన వారికి మౌనం పాటించారు. రూతమ్మ, తండు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కోసూరులో శాంతి సమావేశం నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై



కపిలేశ్వరపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

కోసూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లో శాంతి సమావేశాల్లో సీఐ, ఎస్సైల హెచ్చరిక

కూచిపూడి, మే 19 : ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎవరు కవ్వింపు చర్యలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని పామర్రు సీఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్సై టి.శ్రీనివాస్ హెచ్చరించారు. కాజ, కోసూరు గ్రామాల్లో ఆదివారం శాంతి సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఎక్కువ మంది గుమికూడి ఉండరాదని, రెచ్చగొట్టే ప్రకటనలు చేయరాదని, కవ్వింపు చర్యలకు పాల్పడరాదని, బెట్టింగులు నిషేధమని తెలియజేశారు. ఫలితాలు వెలువడే వరకు ప్రతి ఒక్కరూ సంయమనంతో ఉండి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని హితవు పలికారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి

కపిలేశ్వరపురం(పమిడిముక్కల) : గ్రామాల్లో ఏవిధమైన గొడవలు, తగాదాలకు తావు లేకుండా శాంతి సామరస్యాలతో ప్రశాంత వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలని పమిడిముక్కల ఎస్సై కె. శ్రీనివాస్ అన్నారు. కపిలేశ్వరపురంలో ఆదివారం గ్రామస్థులతో సమావేశమై ఎన్నికల అనంతరం శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృన ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

చల్లపల్లి, మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య నేటితరానికి ఆదర్శప్రాయమని సీపీఎం జిల్లా నేత యద్దనపూడి మధు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత కామ్రేడ్ పుచ్చలపల్లి 39వ వర్ధంతిని గుంటూరు బాపనయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నేత కలపాల దావీదు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారుడు నందేటి శ్రీను గీతాలు ఆలపించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, మాతంగి లక్ష్మయ్య, లంకపల్లి సత్యం, గోళ్ల సాంబశివరావు, బళ్లా వెంకటేశ్వరరావు, బాబు పాల్గొన్నారు. **గుడివాడ :** సుందరయ్య భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు ఎన్.మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన సుందరయ్య 39వ వర్ధంతి నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.రఘు . పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌సిపి రెడ్డి, సిఐటియు నాయకులు టి.లక్ష్మణరావు, బి.వి శ్రీనివాస్, అరుణ, రజిని, కొండ పాల్గొన్నారు. **పామర్రు :** సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సుందర్య చిత్రపటానికి కామ్రేడ్ డాక్టర్ పి.సురేష్ చంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామర్రు డివిజన్ కన్వీనర్ ఒడుగు గంగాధర్ ప్రసాద్, కాటూరి నాగభూషణం, బరిగెల భీమేశ్వరరావు, ముళ్లపూడి విల్సన్, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆదిశేష చాట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం వల్లూరుపాలెంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు జుజ్జువరపు యేసేబు, ఒంద్రు నాగేశ్వరరావు, యేమినేని లెనిల్‌బాబు, ఖాసీం, సింహాద్రి రాంబాబు, ఈడ్పుగంటి డేవిడ్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. **ఘంటసాల :** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఘంటసాలలో మేడంకి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. గొరుముచ్చు వెంకటేశ్వరరావు, వెనిగళ్ల నాగమణి, మువ్వల బాలనాగేశ్వరరావు, వెంగళి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరికి కుంకుమార్చన

పెడన, మే 19 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంతో ప్రఖ్యాతి గాంచిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు రెండో రోజైన ఆదివారం లక్ష కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన పూజల్లో కొమ్మూరి శారద, తమ్మన లక్ష్మీతాయారు, అపర్ణ, కొల్లూరి రాజా, కొల్లూరి రాధాకృష్ణ, జవ్వాది నాగు, మామిడి సావిత్రి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి

అవనిగడ్డ : లక్ష్మీనారాయణ బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 27 వరకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఆదివారం తెలిపారు. 21వ తేదీ ఉదయం 6 గంటల నుంచి విశేష స్నపన, పెండ్లి కుమారుడిని చేయుట, నృసింహ జయంతి కార్యక్రమాలతో ప్రారంభమవుతాయన్నారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి విశేష హోమాలు, స్నాతకపు కావిడి, సాయంత్రం జగాజ్యోతి, ఎదుర్కోలు ఉత్సవం, పోతరాజు షణ్ముఖ వెంకటాచల శ్రీ వాత్సవ - మృణాళిని దంపతులచే కల్యాణ మహోత్సవం జరుపుతామన్నారు. 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్ : బలరామునిపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చెరువు వద్ద వీరబ్రహ్మం గారి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 1961లో కొండయ్య దాస్ బ్రహ్మం గారి విగ్రహాన్ని నెలకొల్పి కాలజ్ఞానాన్ని ప్రచారం చేశారు. మోతుకూరి వీర రాఘవయ్య అనే భక్తుడు సాధువుతో కలసి 64 ఏళ్ల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మోతుకూరి శివరామప్రసాద్, విన్నకోట రమణమూర్తి, మోతుకూరి దర్శన్, నర్సయ్య, రాయన నాగబాబు, బసవ కేశవరావు, కాగిత ఉదయభాను, కాగిత అఖిల, ఈశ్వరమ్మ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పదెకరాల వరిగడ్డి వామి దగ్ధం

చల్లపల్లి : చల్లపల్లి దళితవాడలో కొడాలి సురేష్‌బాబుకు చెందిన పది ఎకరాల వరిగడ్డివామి ఆదివారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అవనిగడ్డ అగ్నిమాపక అధికారులు సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. నష్టం లక్ష రూపాయలకుపైగానే ఉంటుందని అంచనా. కావాలనే ఎవరో వామికి నిప్పుపెట్టినట్లు అనుమానిస్తున్నారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్టు

గుడివాడ : గుడివాడలో లాటరీ టిక్కెట్‌ల అమ్మకాలపై ఉక్కుపాదం మోపినట్లు వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ తెలిపారు. గతంలో నమోదైన లాటరీ కేసుల్లో నిందితుడు గొర్ల రామారావు ఇచ్చిన సమాచారం మేరకు ప్రధాన సూత్రధారి కట్టా నాగకుమార్ స్వామిని అరెస్టు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు ఉషాపద్మిని సమేత సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో గుడివాడకు చెందిన రాజు - రవళి దంపతులు కల్యాణం నిర్వహించారు. తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్ సమీపంలోని పోలీస్ అవుట్‌పోస్ట్ వద్ద ఏఎస్సై భాగవతి సహకారంతో నెల్లూరు జిల్లా మొగిచర్ల శ్రీదత్తస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, నవభారత్ సయ్యద్ గఫార్, కంతేటి హరిబాబు, వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల : మండల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కపిలేశ్వరపురం, అగినపర్రు, మామిళ్లపల్లి, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు. శ్రీరంగపురం, పటమటలంకపల్లి, అప్పారావుపేట, ఎట్టివానిగూడెం ప్రాంతాల్లో సోమవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు భాస్కరరావు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ప్రముఖులు

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జీఎం డి.ప్రభాహరణ్, ఆర్.ఎం. బ్రహ్మయ్య ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. గుడివాడ రీజినల్ మేనేజర్ జి.ఎం.వి.ప్రసాద్, మోపిదేవి బ్రాంచి మేనేజర్ అనంత్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



పమిడిముక్కల : ప్రతిభావంతులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎస్సై కె.శ్రీనివాస్ అన్నారు. టెన్త్ ప్రతిభ చూపిన లక్ష్మీప్రియాంక, మోహన్ లకు ఐనంపూడిలో శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన 21 మంది విశ్రాంత ఉద్యోగులను కమిటీ సత్కరించింది. కమిటీ అధ్యక్షుడు కొల్లి వెంకట ప్రసాద్, సర్పంచ్ యేనుగ బేబి, కమిటీ వైస్ ప్రసిడెంట్, కార్యదర్శులు శీలం మురళి, శీలం రమేశ్, పూర్వ విద్యార్థి పి. శ్రీరామ్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఎలకుర్రులో రెండోరోజుకు బ్రహ్మోత్సవాలు

పామర్రు, మే 19 : ఎలకుర్రు అగ్రహారంలో భ్రమరాంబ సమేత చెన్నమల్లిఖార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాశీనాధుని నాగేశ్వరరావు నేతృత్వంలో మూలవిరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మ వారికి కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ, నిత్యాహోమం, బలిహరణ జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వేదాంతం రాధేశ్యామ్ భక్త ప్రహ్లాద నృత్య నాటిక ఆకట్టుకుంది.

వైభవంగా గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

కోడూరు : లింగారెడ్డిపాలెంలో ఈవో సుధాకర్ పర్యవేక్షణలో గోకర్ణేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి రథోత్సవం, నాటక ప్రదర్శనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

పెడన, మే 19 : పెడన-మచిలీపట్నం మార్గంలోని రైల్వే గేటు సమీపంలో ఆదివారం పట్టాలు దాటుతున్న సుమారు 55 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆ వ్యక్తిని బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన వందన గాత్ర కచేరీ

మచిలీపట్నం టౌన్ : త్యాగరాజు సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో చిట్టి పిళ్లారయ్య స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రముఖ సంగీత విద్వాంసురాలు కొత్తపల్లి వందన (తిరుపతి) నిర్వహించిన గాత్ర కచేరీ ప్రేక్షకుల వీనుల విందు చేసింది. వందన కచేరీకి వయొలిన్‌పై వెంకట కృష్ణ, మృదంగంపై పారుపల్లి సుందరాయ ఫల్గుణ్ సహకరించారు. రాధాకృష్ణమూర్తి, సింగరాజు కళ్యాణి, కాళీపట్నపు ఉమ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పిల్లలతో నీతి కథల పుసకాలు పఠనం చేయించారు. నీతి కథల పుస్తకాలు చదివించడం, పద్యాలు నేర్పించడం, చదివించడం, చిత్రలేఖనం, ఆటల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు లైబ్రేరియన్ టి.వాణి తెలిపారు.



పెరిశేపల్లి వృద్ధాశ్రమంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రవాస భారతీయుల వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ సోమూరి వెంకట్రావ్ అన్నారు. పెరిశేపల్లిలో కృష్ణ ఫౌండేషన్‌కు చెందిన వృద్ధాశ్రమంలో ప్రవాస భారతీయులు స్వప్న విష్ణువర్ధన్, వైద్య విద్యార్థి అజితేష్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం సీనియర్ సిటిజన్ సోమూరి ధర్మారావు (101) ప్రారంభించారు. 300 మందికి పరీక్షలు జరిపి దాదాపు రూ.4లక్షల విలువ గల మందులను పంపిణీ చేశారు. డాక్టర్ వల్లూరిపల్లి సుబ్రమణ్యం, ఎస్.వెంకట్రావ్, మన్నెం భవానీ శంకర్, జయప్రకాష్ నారాయణ, మాగంటి శ్రీనివాస్ విజయ కుమారి, స్వయంప్రభ, భాస్కర ప్రసాద్ వైద్య పరీక్షలు జరిపారు. గొట్టిపాటి లక్ష్మీదాసు, వెంకటేశ్వరరావు, సోమూరి రామ్మోహనరావు, జిల్లా రైస్ మిల్లర్స్ పూర్వ అధ్యక్షుడు సోమూరి కృష్ణాజీ, కృష్ణం ఫౌండేషన్ వృద్ధాశ్రమం మేనేజరు ఎస్.రాంబాబు, చెరుకూరి బాబ్జి, చాపరాల వెంకట రమణ, గొట్టిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుడికి విక్కుర్తి రూ.లక్ష ఆర్థిక సాయం



అవనిగడ్డ, మే 19 : మత్స్యకార కుటుంబంలో పుట్టి బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన గుంటూరు జిల్లా నిజాంపట్నానికి చెందిన కొల్లాటి అశోక్ కుమార్‌కు అవనిగడ్డకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ రూ.లక్ష ఆర్థిక సాయమందించారు. దక్షిణ అమెరికాలో జరుగనున్న అంతర్జాతీయ ముయ్‌థాయ్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అశోక్ కుమార్‌కు అవకాశం రాగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లభించకపోవటంతో విక్కుర్తి శ్రీనివాస్ స్పందించి ఆర్థిక సాయమందజేశారు. వ్యాయామోపాధ్యాయ సంఘ నేతలు ఎం.హరగోపాల్, బి.ఎన్.జి.గోపాల్, ఎస్.గంగాధర్, డి.వెంకటేశ్వరరావు, భారతి, కె.పూర్ణచంద్రరావు, చందు, ఎస్.శ్రీకాంత్, డిపి.ఎస్.ప్రసాద్, గ్రామప్రముఖులు విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్రం, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన అశోక్ కుమార్, అతనికి ఆర్థికంగా తోడ్పాటునందించిన విక్కుర్తి శ్రీనివాస్‌లను వ్యాయామోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.